క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. వారం వారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఎనిమిది అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు. ఆర్డీఓ శ్రీరమణి స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కంచరిందేకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, అధికారులు పాల్గొన్నారు.

నేడు పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం: స్థానిక పురపాలక సర్వ సభ్య సంఘ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన నిర్వహించనున్నట్టు పెద్దాపురం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు చైర్మన్ అధ్యక్షతన జరిగే సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, ఆయా విభాగాల సిబ్బంది హాజరుకావాలని కోరారు.

క్రీడాకారుల విశ్రాంతి గదుల పరిశీలన

సామర్లకోట: ఆగస్టు ఒకటో తేదీ నుంచి 12వ తేదీ వరకూ కాకినాడలో జరగనున్న జూనియర్ జాతీయ హాకీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాటు చేసిన రూములను తహసీల్దార్ కొప్పూరి చంద్రశేఖర రెడ్డి సోమవారం పరిశీలించారు. 29 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మేరకు 200 మంది క్రీడాకారులు సామర్లకోటలో విశ్రాంతి తీసుకొనేలా ఏర్పాటు చేయాలని కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు ఆదేశించినట్టు తెలిపారు. దీనిలో భాగంగా విస్తరణ శిక్షణ కేంద్రంలో 40 మంది, టీటీడీసీలో 80 మంది, సర్వే అడకామిలో 80 మంది విశ్రాంతి తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా గ్రేడ్‌లను బట్టి ఉన్నతాధికారులకు రూములు కేటాయిస్తారని తెలిపారు. ప్రతి రోజు క్రీడాకారులు కాకినాడ వెళ్లి రూములకు తిరిగి వస్తారని తహసీల్దార్ చెప్పారు. డిప్యూటీ సర్వేయర్ వై.శ్రీనివాసు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ సాధించిన రాధాకృష్ణవేణి



పీహెచ్‌డీ పొందిన ఉపాధ్యాయినిని సత్కరిస్తున్న డీవైఈఓ, ఎంఈఓలు

సామర్లకోట: మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఇంగ్లిష్ ఉపాధ్యాయిని కూనిశెట్టి రాధాకృష్ణవేణి పట్టుదలతో కృషి చేసి పీహెచ్‌డీ సాధించినట్టు కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి నాయుడు వెంకటేశ్వరరావు అన్నారు. రాధాకృష్ణవేణి పీహెచ్‌డీ పొందిన సందర్భంగా సోమవారం సాయంత్రం పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేవారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాధాకృష్ణవేణిను మిగిలిన ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రాధా కృష్ణవేణిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, హెచ్‌ఎం టి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పనసపాడు ఫీడర్ మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతులు కారణంగా అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

బాప్టిస్ట్ సంఘాల నూతన కార్యవర్గం ఎన్నిక

పిఠాపురం: బాప్టిస్ట్ సంఘాల గోదావరి అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అనకాపల్లి బాప్టిస్ట్ ఫీల్డ్, రామచంద్రాపురం బాప్టిస్ట్ ఫీల్డ్ వరకు ఉన్న 9 ఫీల్డ్ కౌన్సిల్స్ సమైక్య గోదావరి అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ సెంటినరీ సంఘంలో అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమంలో 130 బాప్టిస్ట్ సంఘాల నుంచి 300 మంది సంఘ కాపరులు, సంఘ నాయకులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.సుధీర్ పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో బాప్టిస్ట్ సంఘాల ఐక్యత, సువార్త పరిచర్య, బాప్టిస్ట్ ఆస్తుల క్రమబద్ధీకరణకు సంబంధించి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గోదావరి అసోసియేషన్ అధ్యక్షుడిగా కడారి శామ్యూల్, సెక్రటరీగా డాక్టర్ జి.ఎలీషాబాబు, కోశాధికారిగా ఎస్.పాలును ఎన్నుకున్నారు. స్థానిక సంఘ అధ్యక్షుడు గుబ్బల సాల్మన్ రాజు, స్థానిక సంఘ కాపరి థియోఫిలాస్, కాకినాడ సెమినరీ కౌన్సిల్ చైర్మన్ కె.జాన్ ఇమ్మానుయేల్, పాస్టర్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానం.. వినోదం..



రాకెట్ నమూనాలు

పిఠాపురం: చిన్నప్పుడు స్కూల్లో పెద్దయ్యాకా నువ్వు ఏమవుతావని అడిగితే డాక్టర్, పోలీస్, లాయర్, సైంటిస్టు అని చెప్పే వాళ్లం కాని తీరా పెద్దయ్యాకా చదువుతో సంబంధం లేని ఉద్యోగంలో స్థిర పడిపోతున్నారు. అయితే ఆసక్తి ఉండి లక్ష్యం నిర్ణయించుకుంటే మాత్రం ఏమి అవ్వాలనుకుంటామో అదే అవుతారు. అలాగే సైంటిస్టు కూడా అంతే. ఇప్పుడు ఈ టాపిక్ ఎందుకనుకుంటున్నారా..

- పిఠాపురంలో 'స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంపు'
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- ఆకట్టుకున్న రాకెట్ నమూనాలు

మన చంద్రయాన్–3 జాబిల్లిని ముద్దాడడంతో ఇస్రో పేరు మారుమోగిపోతోంది. ఫలితంగా ఇస్రోలో జాబ్ సంపాదించాలంటే ఏం చేయాలనే దానిపై విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది. దీంతో వారిలో కొత్త ఆలోచనను ఇంకా పెంచడంతో పాటు బావి తరాలకు సైంటిస్టులను అందించాలనే దృక్పథంతో అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై మక్కువ పెంచి బావి తరాలకు సైంటిస్టులను అందించడమే లక్ష్యంగా ఈ సదస్సులు తొలిమెట్టుగా మారుతున్నాయి. విశ్వం, నక్షత్రాలు, సూర్యుడు, గ్రహాలు, భూభ్రమణం, ఇస్రో ప్రయోగించిన ఉపగ్రహాలు, అంతరిక్ష పరిశోధనల వెనుక జరుగుతున్న కృషిని తెలిపేలా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ నమూనాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. రాకెట్ నమూనాలు విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాయి. అంతరిక్షానికి సంబంధించిన అంశాలను ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాటిని తిలకించిన విద్యార్థులు వాటితో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం చూపించారు.



విద్యార్థులతో అధికారులు

ఆకట్టుకున్న అంతరిక్ష విద్యా శిబిరం

సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్షా, ముస్కాన్ సహకారంతో పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్లో సోమవారం నిర్వహించిన 'స్పేష్ ఎడ్యుకేషన్ క్యాంపు విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్లు, సైన్స్ సిటీ స్టేట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, ముస్కాన్ సంస్థ చీఫ్ ఆపరేషనల్ మేనేజర్ ప్రసిద్ధి దీప్నాథ్, సైన్స్ సిటీ రిలేషన్ ఆఫీసర్ శివరాం తదితరులు హాజరై ఈ క్యాంపులో



ఇస్రో నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

పాఠశాల విద్యార్థులకు రాకెట్ లాంచింగ్ విధానం, వివిధ రకాల రాకెట్లు, వాటిలో వాడే ఇంధనాలు,



టెలిస్కోప్‌లో ఆసక్తిగా చూస్తున్న విద్యార్థి



చంద్ర భ్రమణం నమూనాలు

టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించారు. ఈ సాంకేతికతలు ప్రస్తుతం ఎలా ఉపయోగిస్తున్నారయో వివరిస్తూ ప్రాక్టికల్ డెమోస్ నిర్వహించారు. స్పేస్ ఎడ్యుకేటర్లు విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా ఈ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. ఈ క్యాంపు వారి భవిష్యత్ కెరీర్ నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం గ్రామీణ విద్యార్థుల్లో విజ్ఞానానికి ఒక వేదికగా నిలిచింది.

అవి చూశాకే శాస్త్రవేత్తను అవ్వాలనుకున్నా..



ఎప్పుడు అలాంటివి చూడలేదు. ఎక్కడో టీవీల్లోను పుస్తకాల్లోను చూసి అబ్బా నేను ఇందులో పని చేస్తే బాగుడను అనిపించేది. అలాంటిది వాటిని మా దగ్గరకు తెచ్చి అవి ఎలా పని చేస్తాయో ప్రత్యక్షంగా చూపించే సరికి ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. అవి చూసి నేను ఒక శాస్త్రవేత్తగా ఎదిగి దేశానికి సేవ చేయాలనే ఆలోచన నాలో గట్టిగా కలిగింది. ఇప్పటి నుంచి వీటిపై ఆసక్తి పెంచుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్త ఎలా అవ్వాలనే దానిపై దృష్టి పెట్టాలని నిరణయించుకున్నాను.

– బి.లోవరాజు, పదో తరగతి విద్యార్థి, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్ పిఠాపురం

ఇస్రోకి వెళ్లినట్టుగా అనిపించింది



మాకు మేముగా ఎప్పుడు వెళ్లలేని ఇస్రోకి నేరుగా వెళ్లినట్టుగా అన్ని కళ్లకు కట్టినట్టుగా చూపించారు. అవి చూస్తుంటే ఎక్కడ లేని ఆనందం వచ్చింది. నేనెందుకు అలా శాస్త్రవేత్తగా ఎదగలేను అనిపించింది. నేను శాస్త్రవేత్తగా అవ్వాలని అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొవాలని ఆసక్తి పెరిగింది. మన చుట్టూ జరిగే అంతరిక్ష పరిణామాలు మాకు కళ్లకు కట్టినట్టుగా చూపించి అన్నీ వివరించారు. మాలో ఎక్కడ లేని ఆసక్తిని పెంచారు. ఇప్పటి నుంచి వీటిపై దృష్టి పెట్టేలా చేశారు.

– జి.శ్రీలత, 9వ తరగతి విద్యార్థి, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూలు పిఠాపురం

ఆసక్తి పెంచేందుకే..



విద్యార్థుల్లో విజ్ఞానపరమైన ఆసక్తిని పెంపొందించడంలో ఇటువంటి అవగాహన సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆసక్తిగా ఈ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకున్నారు. ఈ క్యాంపు వారి భవిష్యత్ కెరీర్ నిర్మాణానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థుల్లో విజ్ఞానానికి ఒక వేదికగా ఈ కార్యక్రమం నిలిచింది. విద్యార్థులు చాలా ఆసక్తిగా చూసి అడిగి మరీ తెలుసుకున్నారు.

– ఎం.శ్రీనివాస్ వినీల్, జిల్లా సైన్స్ అధికారి

భవిష్యత్ శాస్త్రవేత్తల కోసమే..



భవిష్యత్ శాస్త్రవేత్తల కోసమే అంతరిక్ష విద్యా శిబిరం ఏర్పాటు చేసాం. ఈ క్యాంప్‌లో పాఠశాల విద్యార్థులకు రాకెట్ లాంచింగ్ విధానం, వివిధ రకాల రాకెట్లు, వాటిలో వాడే ఇంధనాలు, టెలిస్కోప్, రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్లు వంటి ఆధునిక సాంకేతిక అంశాలపై ప్రాథమిక అవగాహన కల్పించాయి. ఈ సాంకేతికతలు ప్రస్తుత కాలంలో ఎలా ఉపయోగించబడుతున్నాయో వివరిస్తూ ప్రాక్టికల్ డెమోస్ నిర్వహించి విద్యార్థుల్లో అవగాహన కల్పించాం. దీనికి మంచి స్పందన వచ్చింది.

– చండిక శ్రీకాంత్, స్టేట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

దళితులకు చేసిందేముంది వెన్నుపోటు తప్ప!

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎంపీ వంగా గీత
- దళిత ఆత్మీయ సమావేశం విజయవంతం
- పిఠాపురం నుంచి కాకినాడకు వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీ

పిఠాపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయ్యింది. కాని దళితులకు వారు ఇచ్చిన హామీలు మాత్రం అలాగే మిగిలిపోయాయి. ఏ ఒక్కటీ అమలు కాకపోవడంతో దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీగా వారి ఆవేదనను అర్థం చేసుకునే పార్టీగా వైఎస్సార్ సీపీ ప్రజల తరుపున పోరాటానికి సిద్ధమైంది. దీనికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తుండడంతో దళిత ఆత్మీయ సమావేశం పేరుతో సోమవారం నిర్వహించిన కార్యక్రమం విజయవంతమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ తెలిపారు. నియోజకవర్గంలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాలతో పాటు పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీలకు చెందిన దళిత నాయకులు, కార్యకర్తలు సోమవారం ఉదయం పిఠాపురంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వంగా గీత ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ర్యాలీగా కాకినాడ తరలి వెళ్లారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో నీకు 15 నీకు 15 అంటూ నమ్మించి మోసం చేశారని లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోలను నిలువునా ముంచేశారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆమె విమర్శించారు. ఉద్యోగాలు ఇవ్వక పోగా ఉన్న ఉద్యోగాలు తీసేస్తున్నారని ఇదంతా ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే సేవలను దూరం చేయడం ప్రభుత్వ పరిపాలన దూరం చేయడమేనన్నారు. తక్షణం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి లేకపోతే ప్రజలు ప్రారంభించిన ఉద్యమం మరి అంత తీవ్రతరం అవుతుందన్నారు. ముఖ్యంగా దళితులకు ఇవ్వాల్సిన పథకాలు ఇవ్వడం లేదన్నారు. వారి అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోడం లేదన్నారు. పిఠాపురంలో దళిత కాలనీల అభివృద్ధి కోసం గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులు వినియోగించకుండా ఈ ప్రభుత్వం అడ్డుకోవడం ద్వారా దళితులకు అన్యాయం చేసిందన్నారు. అందుకే దళితులు అంతా ఏకమై ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా దళితుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోపోతే ఉద్యమం తీవ్రతరం అంవుతుందన్నారు. ఈకార్యక్రమంలో దళిత నాయకులు పిఠాపురం నియోజవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి రమేష్ కుమార్, ఉలవల భూషణం, వర్ధినిడి సుజాత, బత్తిన రాజశేఖర్, పెదపాటి నాగేశ్వరరావు, బోను దేవ, పచ్చిమళ్ల జ్యోతి, వజ్రపు బాబీ, ఆలపు కృపారాణి, శెట్టిబత్తిన నానిబాబు, లోడ అప్పలరాజు, ఎద్దు లోవరాజు, గంధం నాగేశ్వరరావు, అర్థమూరి డేవిడ్, కండవిల్లి చిన లోవరాజు, యాదాల అప్పలరాజు, బోడనాటి రాజేష, కండెపల్లి జ్యోతి, పచ్చిమళ్ల అప్పలరాజు, మంగ, దారా వెంకటరావు, బోయి నాగేశ్వరరావు తదితర దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతున్న వంగా గీతా



పిఠాపురం నుంచి ర్యాలీగా బయలుదేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

- లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై మరింత అవగాహన కల్పించండి
- ఆర్డీఓ కె.శ్రీరమణి

పెద్దాపురం: గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్య నేరమని, ఈ నిషేధ చట్టంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో సోమవారం పెద్దాపురం డివిజన్ ఆఫీసర్ డాక్టర్ ఎన్.ప్రశాంతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించడం చట్టరిత్యా నేరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ శ్రీరమణి హెచ్చరించారు. డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ పెద్దాపురం డివిజన్ పరిధిలో 40 స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్, డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెలలో రెండు డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించామన్నారు. 14 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు చేశామని, తుని విజయలక్ష్మి మల్టీ స్పెషాలిటీ, సురేష్ హాస్పిటల్ వారు మిషన్ మార్పుకు ఆసుపత్రి మూసివేతకు సంబంధించి సబ్ డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ ఆమోదం తరువాత వీరికి సంబంధిత పత్రాలు ఇస్తామన్నారు. మొదటి సారి తప్పు చేసిన వారికి చట్ట ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష, 10 వేల రూపాయలు అపరాధ రుసుం, రెండో సారి తప్పు చేస్తే ఐదేళ్ల జైలు శిక్ష, 50 వేల రూపాయలు జరిమానా విధిస్తారన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఫిర్యాదు చేసే వారు ఫోన్ 9494113365కి వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1800–425–3365కు తెలియపర్చాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యులు అనూష, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



లింగనిర్ధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట స్థానిక పంచారామ క్షేత్రంలో కుమార రామభీమేశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు శ్రావణ మాసం కావడంతో ఆలయంలోని స్వామి, అమ్మవార్లకు, ఉప ఆలయాలోను అర్చకులు పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి స్వామివారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలైన్‌లో భక్తులు వేచి ఉన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరణిలోని నీటితో స్వయంగా అభిషేకాలు చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు. ఆలయ పండితులు అల్లకి రాజగోపాల్ శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. పూజలు అనంతరం స్వామి వారికి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదే విధంగా స్థానిక మఠంసెంటర్‌లోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోను, ఐదు తూముల వద్ద రామలింగేశ్వర స్వామి ఆలయంలోను, గొంచాల, పీబీ దేవం గ్రామాలల్లో వేంచేసి ఉన్న శివాలయంలోను పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాగా ఆగస్టు ఒకటి, 15 తేదీల్లోని శుక్రవారాలు ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఉంటాయని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు.



కుమార రామభీమేశ్వరస్వామి

మూడు జోన్లుగా పట్టణ విభజన

అధికారుల సమావేశంలో కమిషనర్

సామర్లకోట: పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేలా పట్టణాన్ని మూడు జోన్లుగా విభజించడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం పోలీసు, టౌన్ ప్లానింగ్ అధికారులతో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రెడ్ జోన్, గ్రీన్ జోన్, అంబర్ జోన్ ప్రాంతాలను పోలీసుల సమక్షంలో నిర్ణయంచారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాన్ని రెడ్ జోన్‌గా నిర్ణయించారు. ఈ జోన్‌లో రోడ్లపై వ్యాపారాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రెడ్ జోన్ ప్రాంతాల్లో పూర్తి రోడ్లపై వ్యాపారాలను నిషేధించినట్టు తెలిపారు.

ఏడీబీరోడ్డు, సామర్లకోట–కాకినాడ, సామర్లకోట– రాజమహేంద్రవరం, రిజిస్ట్రేషన్ కార్యాలయ సెంటర్, రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్, స్టేషన్ సెంటర్ నుంచి విఘ్నేశ్వర థియేటర్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్ నుంచి ఎన్టీఆర్ స్కూల్, గాంధీబొమ్మ సెంటర్ నుంచి బ్రౌన్‌పేట రోడ్డు, బల్లమార్కెట్ నుంచి ఎన్టీఆర్ స్కూల్, గోలివారి వీధి నుంచి మఠంసెంటర్, మఠంసెంటర్ నుంచి ప్రెసిడెంట్ గారి వీధి, నీలమ్మ గుడి నుంచి తెలుకులపుంత రోడ్డు, తెలుకులపుంత నుంచి పోలీసుస్టేషన్ రోడ్డు, మెహర్ కాంప్లెక్స్ నుంచి పెద్దాపురం రోడ్డు, బ్రౌన్‌పేట నుంచి ప్రతిపాడు జంక్షన్ వరకు రెడ్ జోన్లుగా గుర్తించినట్టు ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తెలిపారు.

గ్రీన్ జోన్‌గా ఎంపిక చేసిన ప్రాంతాలలో వీధి వ్యాపారులకు ఎటువంటి నిషేధం లేదన్నారు. రైల్వే కల్యాణ మండపం నుంచి గాంధీచౌక్, ఎన్టీఆర్ స్కూల్ నుంచి నీలమ్మ గుడి, నంబరు 1 మార్కెట్, నంబరు 2 మార్కెట్, కోట్లమ్మ ట్యాంకు రోడ్డు, ప్రతిపాడు జంక్షన్ నుంచి రాజీవ్ గృహ కల్ప వరకు గ్రీన్ జోన్‌గా ఎంపిక చేశారని చెప్పారు. అంబర్ జోన్‌లో టౌన్ ప్లానింగ్ కమిటీ వ్యాపారాలు చేసుకోవడానికి నిర్ణయించిన రోజులు, సమయాల్లో మాత్రమే వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఉంటుందని గరగారావు తెలిపారు.

గడియారం స్తంభం నుంచి రైల్వే కల్యాణ మండపం, రథం సెంటర్ నుంచి రైల్వే కల్యాణ మండపం, బళ్లమార్కెట్ నుంచి సత్య కృష్ణ థియేటర్ రోడ్డు, విఘ్నేశ్వర థియేటర్ నుంచి మెహర్ కాంప్లెక్స్, గాంధీనగర్ నుంచి గౌతమ్ మోడల్ స్కూల్ వరకు అంబర్ జోన్‌గా అధికారులు గుర్తించారని చెప్పారు. ఈ మేరకు నిర్ణయం తీసుకోవాల్సిన ఉందన్నారు. ఇటీవల మున్సిపల్ ఆర్డీ కాకినాడ జిల్లాలోని మున్సిపల్ అధికారులకు సామర్లకోటలో నిర్వహించిన సమావేశంలో జోన్లు విభజన జరగాలని సూచించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే దీనిపై కౌన్సిల్ అంగీకారం కావలసి ఉంది. చైర్‌పర్సన్ వివాదం కోర్టులో ఉన్న కారణంగా గత మూడు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగడం లేదు. దాంతో ఏ విధంగా నిర్ణయం ఉంటుందో వేచి చూడాలి. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.



వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించిన కమిషనర్

కుళాయి నుంచి బురదనీరు

కొత్తపల్లి: గ్రామాల్లో వాకతిప్ప శివారు రక్షిత మంచినీటి పథకం ద్వారా సోమవారం బురదనీరు సరఫరా అయ్యింది. వీధి కుళాయిలతోపాటుగా ఇళ్ల కుళాయిల ద్వారా కూడా మంచినీరు బురదగా రావడంతో ప్రజలు ఆందోళన చెందారు. గత నాలుగు రోజులుగా మంచినీరు ఎరువు రంగులో వస్తుందని ప్రజలు చెబుతున్నారు. దీంతో తాగునీటిని ప్రైవేట్ వాటర్ ప్లాంట్లకు వెళ్లి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. కలుషితమైన నీటిని తగడం వల్ల రోగాల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మంచినీటిపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు

ఇదోరకం గ్రీవెన్స్ సెల్



పిఠాపురం: గ్రీవెన్స్ సెల్ అంటే సెల్‌ఫోన్లతో ఆటాడుకోవడం అనుకున్నారో ఏమో అదే చేస్తుకూర్చున్నారు అధికారులు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా చెప్పుకునే పీజీఆర్ఎస్ గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలు విని పరిష్కరించాల్సిన అధికారులు సెల్ ఫోన్లతో కాలక్షేపం చేయడం పిఠాపురం పాడా కార్యాలయంలో సోమవారం విమర్శలకు దారితీసింది. నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి పాడా పీడీ, ఏపీడీతోపాటు మున్సిపల్ కమిషనర్లు, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు హాజరవుతుంటారు. ఏదో తమ సమస్య చెప్పుకుని పరిష్కరించుకుందామని వస్తే మొక్కుబడిగా వినతిపత్రాలు తీసుకోవడం తప్ప ఎవరూ పట్టించుకోడం లేదని అర్జీదారులు వాపోతున్నారు. సమస్యలు వినాల్సిన అధికార యంత్రాంగం సెల్‌ఫోన్లలో నిమగ్నమవ్వడం చూసిన అర్జీదారులు వీళ్లా మన సమస్యలు పరిష్కరించేదంటూ ముక్కున వేలేసుకున్నారు.